క్లుప్తంగా

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థికసాయం

కంభం: అనారోగ్యంతో బాధపడుతున్న దొడ్డోజి రంగపుల్లయ్య ఆచారికి ప్రకాశం జిల్లా విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రూ.46,000 ఆర్థిక సాయం అందించారు. రంగపుల్లయ్య రెండు ఊపిరితిత్తులు దెబ్బతిని ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న కంభం మండల కమిటీ నాయకులు జిల్లా సంఘానికి తెలియజేశారు. దీంతో స్పందించి బాధితుడికి ఆర్థిక సాయం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ సంఘ కంభం మండల అధ్యక్షుడు యద్దనపూడి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి సుబ్రహ్మణ్యం, కోశాధికారి వీరబ్రహ్మం, గిద్దలూరు అధ్యక్షుడు కోటిలింగం, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ అధ్యక్షతన సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రావూరి జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించనున్న నేపథ్యంలో అధికారులు తమ శాఖల నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ చైర్మన్లు, కో ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

గిద్దలూరులో ఆర్ఆర్ఆర్ సెంటర్ల ఏర్పాటు

గిద్దలూరు రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర పంచాయతీ పరిధిలో ఈ నెల 17 నుంచి జూన్ 4వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ రామకృష్ణయ్య తెలిపారు. అందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం, స్టేషన్ రోడ్డు, చందు లాడ్జి సమీపంలో ఆర్ఆర్ఆర్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణ ప్రజలు ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, చెప్పులు, పరుపులు, బొమ్మలు, ఇనుప కుర్చీలు, బీరువాలు, ఎల్రక్టానిక్ వస్తువులు, ఇతర అన్ని రకాల వస్తువులను సదరు సెంటర్లలో అందిస్తే ఆ వస్తువులను అవసరమైన ఇతరులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆయా కేంద్రాల్లో పాత వస్తువులు ఇవ్వదలచిన వారు సచివాలయాల పరిధిలోని శానిటేషన్ సెక్రటరీలకు సమాచారం అందించాలని సూచించారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


పనులను పర్యవేక్షిస్తున్న ఏఈ హనుమానాయక్


తర్లుపాడు: ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో ఆదివారం మధ్యాహ్నం స్థానిక శివాలయం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు అంగన్‌వాడీ స్కూల్ భవనంపై పడటంతో ఏఈ హనుమానాయక్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యుత్ స్తంభాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

361 మందికి ఉచిత వైద్య సేవలు


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ బ్రహ్మానందరెడ్డి

గిద్దలూరు రూరల్: డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో మండలంలోని ముండ్లపాడు, ఉయ్యాలవాడ గ్రామాల్లో ఆదివారం 361 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. డా.బ్రహ్మానందరెడ్డి పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. 39 మందికి కంటి ఆపరేషన్‌లు, ఏడుగురికి చెవి, ముక్కు ఆపరేషన్లు, ఇద్దరికి ఎముకల ఆపరేషన్లు అవసరమని గుర్తించి ఆ ఖర్చులను సైతం బ్రహ్మానందరెడ్డి భరాయించనున్నట్లు తెలిపారు. వైద్య సేవలు పొందిన వారికి ఉచితంగా మందులతో పాటు అన్నదానం చేశారు.

కుక్కదాడిలో యువకుడికి గాయాలు


కుక్క దాడిలో గాయాలపాలైన వ్యక్తి

ముండ్లమూరు: మండల కేంద్రమైన ముండ్లమూరు ఎస్సీ కాలనీలో కుక్క దాడి చేయటంతో యువకుడికి గాయాలయ్యాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన పునీత్ కుమార్ ముండ్లమూరులో పొక్లెయిన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పనిచేసిన నగదును అడిగేందుకు ఆదివారం ఎస్సీ కాలనీకి వెళ్లాడు. అక్కడ కుక్క దాడి చేయటంతో గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం వ్యాక్సిన్ వేశారు. తరచూ కుక్కలు ఎవరో ఒకరిపై దాడి చేస్తుండటంతో గాయాలపాలవుతున్నారు..

పృథులాపురికి నిధుల వరద

- పొదిలికి అమృత్ పథకంలో రూ.110 కోట్లు
- రూ.50 కోట్ల నిధులతో సాగర్‌నీరు
- ప్రధాన రహదారి అభివృద్ధికి రూ.11 కోట్లు


పట్టణ ప్రదాన రహదారి కర్నూలు, నంద్యాల రోడ్డు

పొదిలి: పొదిలి వాసుల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న పెద్ద చెరువుకు సాగర్ నీటి తరలింపు పథకం సాకారం కానుంది. మరో వైపు అమృత్ పథకంలో రామతీర్థం నీరు ఇంటింటికీ చేరనుంది. తాగునీటి సమస్య తీర్చే డబుల్ ధమాకా పథకాలు మంజూరయ్యాయి. ఇటీవల మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పథకం పనులు చేపట్టేందుకు ఉద్దేశించిన శిలాఫలకం ఆవిష్కరించారు. రూ.50 కోట్ల నిధులతో కొత్తరెడ్డిపాలెం సమీపం నుంచి దర్శి సాగర్ కెనాల్ నుంచి, పెద్ద చెరువు వరకు సుమారు 17 కిలోమీటర్లు పైపులైన్ ఏర్పాటు చేస్తారు. ఈపైపులైన్ ద్వారా పెద్ద చెరువుకు సాగర్ నీటితో నింపుతారు. ఈ మేరకు పథకం కోసం అవసరమైన నీటి కేటాయింపులు కూడా పథకం నిధులతో పాటే మంజూరయ్యాయి.

> **పనులు సత్వరమే జరిగేలా చేస్తాం**
>
> 
>
> మొత్తం రూ.171 కోట్ల నిధులను సీఎం మంజూరు చేశారు. మంచినీటికి, ప్రధాన రహదారి అభివృద్ధి కోసం నిధులు వినియోగిస్తారు. తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది. సాగర్‌నీరు, రామతీర్థం నీరు అందుబాటులోకి వస్తుంది. నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం. ఆ పనులు త్వరితగతిన జరిగేలా ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తాం. ప్రత్యేకించి పొదిలి ప్రజల తరపున సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.
>
> – కే.పీ.నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే

అమృత్ 2.0 పథకంలో రూ.110 కోట్లు

రాష్ట్ర నీటి ప్రణాళికలో భాగంగా, అమృత్ 2.0 పథకంలో భాగంగా పొదిలి నగర పంచాయతీకి రూ.110 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కేవలం మంచినీటి కోసమే ఈ నిధులను వినియోగిస్తారు. రామతీర్థం జలాశయం నుంచి పైపులైన్ ద్వారా పొదిలికి నీటిని తరలిస్తారు. అవసరమైన చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మాణం, మొత్తం కొత్త పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు కోసం ఈ నిధులు కేటాయించారని అధికారులు చెప్పారు.

రూ.11 కోట్లు ప్రధాన రహదారి అభివృద్ధికి మంజూరు

నగర పంచాయతీ అయిన తరువాత అభివృద్ధికి నిధులు పెద్ద ఎత్తున మంజూరు కావటం ఇదే ప్రథమం. ప్రధాన రహదారి ఇరుగ్గా ఉండటం, ఇరువైపులా వర్షపు నీరు నిలబడటంతో రాక పోకలకు సమస్యగా మారింది. దీంతో సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి చేసిన ప్రతిపాదనలకు, స్పందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.11 కోట్ల నిధులు మంజూరు చేశారు. పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కావటంతో పాటు, డ్రైనేజీ సమస్య తీరుతుంది.

పోలేరమ్మతల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ తల్లి


అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు


పత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్టకు, నాగశిలలకు భక్తులు పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

భక్తి శ్రద్ధలతో పోలేరమ్మ తిరునాళ్ల

కురిచేడు: స్థానిక కోట బజారులో వేంచేసి ఉన్న శ్రీపోలేరమ్మ తిరునాళ్ల ఆదివారం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ తల్లితోపాటు పోతురాజుకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదానం కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రికి రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండహారతి నిర్వహించారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గుంటి గంగా భవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పన్నెండు చీరల బహూకరించారు. ఆలయానికి రూ. 17,234 ఆదాయం వచ్చినట్లు ఆర్‌వో శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు సౌకర్యాలను ఈఓ భాస్కర్ రెడ్డి పర్యవేక్షించారు.


పోలేరమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


పోతురాజుకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

29న సీతారామస్వామి ద్వితీయ వార్షికోత్సవాలు

గిద్దలూరు రూరల్: మండలంలోని బురుజుపల్లె గ్రామంలో గల సీతారామస్వామి ద్వితీయ వార్షికోత్సవాలను ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు 28వ తేదీ రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.50 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 94415 79589 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పనిచేయని బోరు.. పట్టించుకోని అధికారులు


పనిచేయని బోరు

కంభం: స్థానిక పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని జగనన్న కాలనీలో మూడు నెలలుగా బోరు పనిచేయకపోవడంతో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగనన్న కాలనీలో సుమారు వందమందికిపైగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. కాలనీలో రెండు బోర్లు ఉండగా, ఒక బోరు పని చేయడం లేదు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదని, దీంతో నిర్మాణ పనులకు ఇబ్బందిగా ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు. బోరుకు సంబంధించిన స్టాటర్ బాక్సు కూడా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకుని ఉందని, వర్షం కురిస్తే షాక్ కొట్టే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పనిచేస్తున్న బోరు పైప్‌లైన్ సక్రమంగా లేనందున నీరు వృథాగా పోతోందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని గృహాల లబ్ధిదారులు కోరారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు


గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

తర్లుపాడు: ప్రకృతిలోని పచ్చదనాన్ని కాపాడుకుంటూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అటవీ శాఖ సెక్షన్ అధికారి పీవీ సాయికుమార్ సూచించారు. ఆదివారం తాడివారిపల్లిలో పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జలవనరులను పరిరక్షించుకుంటూ నీటిని పొదుపు చేసుకుంటే ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవచ్చన్నారు. మొక్కలు సకల జీవకోటికి ప్రాణవాయువని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా భావితరాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అడవికి ముప్పు–మానవాళికి ముప్పు అని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది జాలిరెడ్డి, పి.డేవిడ్, ఎన్ఈ రమణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

హాకీ శిక్షణ శిబిరం ప్రారంభం


హాకీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ జవహర్, ఎస్సై రామిరెడ్డి

చీమకుర్తి: స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హాకీ శిక్షణ శిబిరాన్ని జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్, ఎస్సై జీ రామిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు హాకీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులందరికీ ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కోచ్ వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో పోకూరి రామకృష్ణారెడ్డి, గొల్లపూడి శ్రీహరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరానికి అనూహ్య స్పందన


విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీధర్‌శర్మ

కొమరోలు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తుండగా, దాదాపు 50 మంది విద్యార్థులు పాల్గొంటూ వివిధ అంశాలపై ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు. చిత్రలేఖనం, కథలు చదవడం, బొమ్మలు వేయడం, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు గ్రంథపాలకురాలు ప్రసన్న కుమారి తెలిపారు. ప్రతిరోజూ స్పోకెన్ ఇంగ్లిషుపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ


సభలో మాట్లాడుతున్న వక్తలు

దర్శి టౌన్: మండలంలోని మారెడ్డిపల్లెలో ఆదివారం రాత్రి వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఆయన తనయుడు వంగవీటి రాధాకృష్ణ ఆవిష్కరించారు. వంగవీటి రంగా ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, ఏఎంసీ చైర్మన్ వైవీ సుబ్బయ్య, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వంగవీటి రంగా అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతి హోమం

కందుకూరు అర్బన్: పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయ ఆవరణలో వేంచేసి ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం సరస్వతి హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు కోదండ రామాచార్యుల ఆధ్వర్యంలో సరస్వతి హోమం సాగింది. ఈ సందర్భంగా దేవకి హరినాథ్‌బాబు విద్యార్థులతో పూజలు చేయించారు.


వాలీబాల్‌లో శిక్షణ..

వేసవి శిక్షణ.. విశేష స్పందన

మార్కాపురం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కోడి రామ్మూర్తి క్రీడా సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో గత పది రోజులుగా వేసవి ఉచిత శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. సుమారు 127 మంది విద్యార్థులు రోజూ బాక్సింగ్, వాలీబాల్, ఫుట్‌బాల్, కర్రసాము, నటన తదితర విభాగాల్లో ఉదయం సాయంత్రం శిక్షణ పొందుతున్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో గత 20 ఏళ్లుగా ఏటా వేసవిలో విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఉదయం 7 గంటలకు గ్రౌండ్‌కు తీసుకొస్తున్నారు. కోచ్‌లు కాళంగి శ్రీనివాసులు, రాంబాబు, రామకృష్ణ, పిన్నిక నాగేశ్వరరావు తదితరులు ఉదయం 2 గంటలు, సాయంత్రం 2 గంటలు శిక్షణ ఇస్తున్నారు. జూన్ 10వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని శిక్షకులు తెలిపారు. ఇంకా వ్యక్తిత్వ వికాసం, స్పోకెన్ ఇంగ్లిష్, భారత రామాయణ కథలతో పాటు దుర్యోధన, రావణబ్రహ్మ, అల్లూరి, బాలవర్ధిరాజు.. ఇలా అనేక సాంఘిక, పౌరాణిక నాటకాల్లోని ఏకపాత్రలు కూడా నేర్పుతున్నారు.


బాక్సింగ్‌లో చిన్నారులకు తర్ఫీదు


నటనలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

> **శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి**
>
> 
>
> వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉచితంగా వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. తల్లిదండ్రులు ఇక్కడికి తీసుకొస్తే చాలు. శిక్షణ అనంతరం దాతల సహకారంతో అల్పాహారాన్ని కూడా అందిస్తున్నాం.
>
> – శ్రీనివాసులు, కోచ్

ఘనంగా ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాలు

తాళ్లూరు: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు ఆదివారం గుంటి గంగలో నిర్వహించారు. ఒంగోలు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి శాగం కొండా రెడ్డి అధ్యక్షతన సభను నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, నారపుశెట్టి పాపారావు, విజయ్‌కుమార్, హర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవి కుమార్, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొని ఎన్‌టీఆర్ సినీ, రాజకీయ జీవితం ప్రాముఖ్యత వివరించారు. ముందుగా స్థానిక నాయకులతో కలిసి ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. వైద్యశిబిరం, రక్తదానం నిర్వహించారు.

స్థల వివాదంపై కేసు నమోదు


మాట్లాడుతున్న ఎస్సై రామక్రిష్ణ

దర్శి టౌన్: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సబ్ స్టేషన్ ఆధీనంలో ఉన్న స్థలంలో పలువురు స్థలం తమదే అంటూ పొక్లెయిన్ సహాయంతో ఆదివారం అక్కడ శుభ్రం చేయడం వివాదాస్పదమైంది. విద్యుత్ ఉద్యోగులు, అక్కడికి వచ్చిన వారు తమదే స్థలం అంటూ వాగ్వాదానికి దిగారు. విద్యుత్ ఏఈ ప్రసాద్ రెవెన్యూ, ఎస్సై రామక్రిష్ణకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థలంలోకి ప్రవేశించటంతో పాటు విద్యుత్ లైన్‌మెన్ విధులకు ఆటంకపరిచారన్న ఫిర్యాదు మేరకు పోలేపల్లి సత్యనారాయణ, వెంకట రెడ్డి మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రైవేటు బీఈడీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ప్రైవేటు బీఈడీ కళాశాలలో జరుగుతున్న అక్రమాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి జీవన్ అధికారులను కోరారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఈడీ కళాశాల నిర్వహణపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.


కనపడటంలేదు
ఈ ఫోటోలో ఉన్న ఆమె పేరు
లోముడ లక్ష్మీ దేవి,
వయస్సు 62 సంవత్సరాలు ఈమెది ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణంలోని రాజనగర్‌లో నివాసం ఉంటున్న వ్యక్తి. ఇంట్లో జరిగిన చిన్న గొడవ కారణంగా ఇంట్లో నుండి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. గత రాత్రి నుంచి కుటుంబ సభ్యులు అన్నీ చోట్ల వెతుకుతున్నా ఈమె ఆచూకీ లభ్యం కాలేదు. కావున ఈ ఫోటోలో ఉన్న ఆమె ఎవరికైనా కనిపిస్తే క్రింది నెంబర్స్‌కి తెలుపగలరు అని మనవి. వివరాలు తెలిపిన వాళ్లకు తగిన బహుమతి ఇవ్వబడును.
లోముడ లక్ష్మీ దేవి
సెల్ : 95501 54821
9849882649
ఎత్తు : 5.3, రంగు తెలుపు, వయస్సు : 62 సంవత్సరాలు,
ధరించిన దుస్తులు : తెల్లని చీర వాటి పై బ్లూ కలర్ చుక్కలు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com